క్లుప్తంగా

బస్సు పాస్ చార్జీల పెంపు సరికాదు

నిజామాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్ పాస్ చార్జీలు 20 శాతం పెంచడంపై మంగళవారం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ఒక ప్రకటనలో స్పందించారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కారు మహాలక్ష్మీ పేరుతో మహిళలకు ఉచిత బస్సును కల్పిస్తానని చెప్పి మిగితా వారికి 20 శాతం టికెట్ రేట్లను పెంచడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, మంత్రివర్గ కూర్పు కోసం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే పెంచిన ఆర్టీసీ చార్జీలను తగ్గించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్జేస్తున్న భూభారతి చట్టం రెవెన్యూ సదస్సులు మంగళవారం కొనసాగాయి. కులాస్‌పూర్, మంచిప్ప గ్రామాల్లో సదస్సులు కొనసాగగా, ప్రజలు, రైతులు వందల సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు చేశారు. మంచిప్ప రైతువేదికలో తహసీల్దార్ రామేశ్వర్ బృందం, కులాస్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో డీటీ సరిత బృందం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్జేస్తుందని, భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రామేశ్వర్ సూచించారు.

గోశాల పరిశీలన

నిజామాబాద్ రూరల్: నగరంలోని కంఠేశ్వర్‌లో గల నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో ఉన్న గోశాలను మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ విజయ రామారావు పరిశీలించారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధుల నుంచి గోవులకు కాపాడుకోవాలని సూచించారు. ఎలాంటి వ్యాధులు సోకకుండా కాపాడుకోవాలని సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిరికొండ: మండలంలోని న్యావనందిలో పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. చౌట్‌పల్లి చిన్న లింబయ్యకు రూ.29 వేలు, గణపురం సుదర్శన్‌కు రూ.60 వేలు, దర్పల్ల వెంకవ్వకు రూ.42 వేలు, రాజుల గంగాదాస్‌కు రూ.13 వేలు, సూర రుచితకు రూ.14,500 విలువైన చెక్కులను అందజేశారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ వీరు, గ్రామ శాఖ అధ్యక్షుడు నరేందర్, జనార్దన్ యాదవ్, సాగర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు

నిజామాబాద్ రూరల్: నగరంలోని మాధవ నగర్ సాయిబాబా ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. అసిస్టెంట్ కమిషనర్ విజయరామారావు ఆధ్వర్యంలో రెండు నెలల 28 రోజుల హుండీలను తీసి భక్తులతో కలిసి హుండీని లెక్కించారు. మొత్తం రూ.2 లక్షల 47వేల 486 వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యనిర్వహణ అధికారి శ్రీరామ్ రవీందర్, పూజారులు మాణిక్య శర్మ, హరికృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ హరితారాణి, భక్తులు పాల్గొన్నారు. అలాగే కంఠేశ్వర్‌లోని నీలకంఠేశ్వరాయలంలో హుండీని లెక్కించారు. రూ.1,74,167 నోట్లు, రూ. 28,580 నాణేలు, మొత్తం రూ.2,02,747 వచ్చినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు, ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	థగ్‌లైఫ్ -1.25,7.35, 10.40
స్క్రీన్-2	శ్రీశ్రీశ్రీ రాజావారు-10.40, 4.40, 10.35 - భైరవం-1.40, 7.40
స్క్రీన్-3	హౌస్‌ఫుల్-5(హిందీ)-10.30, 1.25, 4.30, 7.35, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కరాటే కిడ్ లెజెండ్స్-11.00, మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్)-1.15, భైరవం- 4.45, 10.35, భూల్ చుక్ మాఫ్(హిందీ)- 7.55
స్క్రీన్-2	హౌస్‌ఫుల్-5(హిందీ)-9.40, 3.40, 7.10, 10.40
	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
స్క్రీన్-3	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-11.30
	బద్మాషులు-2.00 ,థగ్‌లైఫ్-4.35, 10.40
	పాడేరు 12 మైలు-8.00
స్క్రీన్-4	మిషన్007 - 11.05, హౌస్‌ఫుల్-5బి(హిందీ)- 1.40, శ్రీశ్రీశ్రీ రాజావారు- 5.10, 10.45, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-8.15

లలితామహల్ భైరవం దేవి శ్రీశ్రీశ్రీ రాజావారు

నటరాజ్ హౌస్‌ఫుల్-5(హిందీ) విజయ్ థగ్‌లైఫ్



నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



చెట్టు విరిగిపడటంతో ధ్వంసమైన కారు

ఈదురు గాలుల బీభత్సం

● కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ● పలుచోట్ల దెబ్బతిన్న వాహనాలు

సోమవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో నిజామాబాద్ నగరంతో పాటు రూరల్ ప్రాంతం అతలాకుతలమైంది. పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. నగరంలో ట్రాఫిక్ జామ్ అయింది. విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడే విరిగిపోయి నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్



నేలకొరిగిన విద్యుత్ స్తంభం



మహాలక్ష్మీనగర్ కాలనీలో..



బస్వాగార్డెన్ రోడ్డులో..



మెంట్రాజ్‌పల్లిలో ఈదురు గాలులకు దిమ్మెపై నుంచి పక్కకు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్



మెంట్రాజ్‌పల్లిలో విరిగిపడిన విద్యుత్ స్తంభం



నగరంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద..



బర్థిపూర్‌లో బైక్‌పై పడిన చెట్టు

సాక్షిపై దాడి..కొమ్మినేని అరెస్టు అక్రమం



డిచ్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



సిరికొండలో ..

సాక్షినెట్‌వర్క్ : 'సాక్షి' కార్యాలయాలపై అకారణంగా టీడీపీ గూండాలు దాడులకు పాల్పడటాన్ని, ప్రముఖ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం సాక్షి సిబ్బందితో పాటు వివిధ జర్నలిస్టు సంఘాలు, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ తప్పిదాలను సాక్షి మీడియా ప్రశ్నిస్తున్నదన్న ఒక్క కారణంతోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కక్ష గట్టారని విమర్శించారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడేనని వ్యాఖ్యానించారు. టీడీపీ రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్త కంఠంతో కోరారు. పలు చోట్ల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కొన్నిచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలిచ్చారు.



ఇందల్వాయిలో..



జక్రాన్‌పల్లిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మోపాల్: మండలంలోని బైరాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో మొదటివిడతలో 32 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన వారందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. మంజూరైన వారంతా త్వరగా ఇళ్లను ప్రారంభించాలని సూచించారు. నాయకులు ప్రతాప్‌సింగ్, వసంత్‌రావు, చరణ్ సింగ్, అంబర్ సింగ్, రాంనాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని కొండాపూర్, పాకాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. భూమి పూజ చేసి ముగ్గు పోశారు. కొండాపూర్‌లో బుచ్చన్న, శ్రీధర్, ఆకుల జగన్, చంద్రాగౌడ్, బలరాం, పాకాలలో పీఏసీఎస్ డైరెక్టర్ రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,08,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
జిర్నుకాయ	60	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	100	140	చామగడ్డ	30	50
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	70
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్

కవితల పోటీలలో ప్రతిభ



నిజామాబాద్ రూరల్: వసుంధర విజ్ఞాన మండలి(హైదరాబాద్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి విద్యార్థుల కవితల పోటీలలో నిజామాబాద్ రూరల్ మండలం గుండారం పాఠశాలకు చెందిన ఎస్.అశ్విని, ఎస్. విజయలక్ష్మిలు ప్రతిభ చాటి బహుమతులు అందుకున్నారు. ఆదివారం అమ్మకు సెలవు అనే అంశం మీద విద్యార్థులకు కవితల పోటీలను నిర్వహించారు. మంగళవారం రవీంద్ర భారతిలో వీరు బహుమతులు అందుకున్నట్లు మార్గనిర్దేశ ఉపాధ్యాయుడు దస్తగిరి తెలిపారు.

'నర్సయ్య స్ఫూర్తితో ఉద్యమాలు'



మోపాల్: రైతాంగ పోరాటయోధుడు, అఖిలభారత రైతు కూలీ సంఘం గౌరవాధ్యక్షుడు నాయక్‌వాడి నర్సయ్య పోరాట స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలను నిర్మిద్దామని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పేర్కొన్నారు. మంగళశారం ఏఐకేఎంఎస్ మోపాల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నర్సయ్య సంతాప సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. నిజాంసాగర్ ఆయకట్టు రక్షణ కోసం జరిగిన రైతు ఉద్యమం, ఎన్‌సీఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని జరిగిన ఉద్యమంలో నాయక్‌వాడి నర్సయ్య కీలకంగా వ్యవహరించారని తెలిపారు. నర్సయ్య మరణం రైతు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గు ఎర్రన్న, నాయకులు బండమీది నర్సయ్య, బి గంగారాం, అగ్గు చిన్నయ్య, వేల్పూర్ రమేష్, తదితరులున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశాడు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం రఘురాం మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం 20 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దినేశ్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం ఇచ్చిన జీవోలను పట్టించుకోవడంలేదని అన్నారు. ఆజాద్, అభి, గణేష్ పాల్గొన్నారు.

పెంచిన బస్ పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలి



నిజామాబాద్‌అర్బన్: పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్టీసీ బస్ పాస్ చార్జీలు దాదాపు 20 శాతం పెంచిందన్నారు. పెంపు వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమవుతున్న సందర్భంలో ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదన్నారు. ఒకవైపు ఫ్రీ బస్సు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ మరో కవైపు పేద విద్యార్థుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమని అన్నారు. సమావేశంలో నగర పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, నిఖిల్, ముక్తశ్రీ, దుర్గాప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న టిఫిన్ సెంటర్లకు జరిమానా



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నారు. మంగళవారం నగరంలోని పలు హోటళ్లను తనిఖీ చేశారు. రోడ్లపై విక్రయిస్తున్న తినుబండారాలు, టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఖిల్లా చౌరస్తా, అర్సపల్లి, మాలపల్లి, బోధన్ రోడ్డు, కంఠేశ్వర్, కంఠేశ్వర్ బైపాస్ ఏరియాల్లో ఏఎంసీ జయకుమార్ తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న టిఫిన్ సెంటర్లకు జరిమానా విధించారు. 7 టిఫిన్ సెంటర్లకు రూ.17 వేల జరిమానా విధించారు. తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ వాడవద్దని సూచించారు. జరిమానా విధించినా మళ్లీ తిరిగి వాటిని వాడితే ఈ సారి హోటల్స్, టిఫిన్ సెంటర్లు మూసివేస్తామని హెచ్చరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, సానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, ఇన్స్‌పెక్టర్లు శ్రీకాంత్, సునీల్, కృష్ణ, జవాన్లు ఇతర సిబ్బంది ఉన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం



జక్రాన్‌పల్లి: వ్యవసాయ సాగులో పంటల మార్పిడి ద్వారా సుస్థిర ఆదాయం సంపాదించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజు భార్గవి(ప్రాంతీయ వరి పరిశోధన స్థానం రుద్రూర్) పేర్కొన్నారు. మంగళవారం పడకల్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ.. రైతులకు వివిధ అంశాలపైన అవగాహన కల్పించారు. యూరియా, ఇతర ఎరువుల వాడకం, తెగుళ్లు, పురుగు మందుల వాడకం, రసీదు తీసుకోవడం, విత్తన శుద్ధి చేసుకోవడం మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ఏవో దేవిక, వ్యవసాయ విస్తరణ అధికారి సుభాష్య, రైతులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



గుంతలమయంగా మారిన గురుకులానికి వెళ్లే రోడ్డు

రోడ్డు ఇలా.. గురుకులానికి వెళ్లేదెలా..?

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామ శివారులోగల మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలమయమై నీరు నిలిచింది. గురుకులానికి వెళ్లే వారికి ఇబ్బందిగా తయారైంది. రెండ్రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– ఇందల్ నాయక్, బైరాపూర్

మాకు ఫొటో పంపండి మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

సమాచారం..

17న నీలగిరి చెట్ల బహిరంగ వేలం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లిలోగల ప్రభుత్వ బాలుర గిరిజన వసతి గృహంలోని 14 నీలగిరి చెట్లకు ఈనెల 17న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 11 గంటలకు ఎంపీడీవో, తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, వసతిగృహ సంక్షేమాధికారి సమక్షంలో వేలం పాట ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఆంగ్లం, జంతు శాస్త్రం బోధించటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్‌రెడ్డి తెలిపారు. పీజీ, బీఈడీ, టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 17న డెమో ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

పార్ట్ టైం అధ్యాపక పోస్టుకు..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల/కళాశాలలో గంటల ప్రాతిపదికన పాఠాలు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.దశరథ్ మంగళవారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.18,200 గరిష్ఠ వేతనం చెల్లిస్తామన్నారు. 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. పీజీటీ(జువాలజీ) అధ్యాపకుడిగా పని చేసేందుకు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం (11న) విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్‌ను ఆదర్శ పాఠశాలలో సమర్పించాలని తెలిపారు. 12న దరఖాస్తు చేసుకున్న వారికి డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948499296ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



ధర్పల్లి: మండలంలోని దుబ్బాక నల్లగుట్ట నరసింహస్వామి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన 28 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా దొర్ల సంతోష్ రెడ్డి, కార్యదర్శిగా మేస హరీష్, కోశాధికారిగా కూర నరసయ్య ఎంపికయ్యారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని, ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చైర్మన్ సంతోష్ రెడ్డి తెలిపారు.

చరిత్ర, సైన్స్ విషయాలు నేర్చుకోవాలి

నిజామాబాద్ అర్బన్: విద్యార్థులు చరిత్ర సైన్స్ విషయాలను కూడా నేర్చుకునే దృక్పథాన్ని కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్‌లో 'జీవ పరిణామం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనువాద శక్తులు మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల్ని మతం పేరుతో విడదీస్తున్న తరుణంలో ప్రజల్ని అప్రమత్తం చేయడంలో ప్రగతిశీల శక్తులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. సైన్స్, చరిత్రపై సమకాలీన రాజకీయాల పట్ల ప్రజల్ని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. రవీందర్, మురళి, నారాయణ, సంధ్యారాణి పాల్గొన్నారు.